# 7. న్యాయం

వాన కురిసింది.

కురిసిన వాన కుండపోతలా కురవలేదు. కరువు గొట్టు వాన కరువుగా రెండు జల్లులు కురిసిపోయింది. ఆకాశంలో తెల్లని మబ్బులు తెల్ల మొహా లేసుగుని తిరుగుతున్నాయ్. వాన వెలిసిపోయినా-ఆసాయంకాలం - వానగాలి చల్లగా వీస్తోంది. ఆవూరి మధ్యనవున్న రావిచెట్టు - చల్ల గాలికి వూగుతూ వుత్సాహంగా వుంది.

వాన వెలిసిన వెంటనే, ఆవూరి జనం రావి చెట్టు దగ్గర చేరారు. కొందరు రాతి పలకల మీద కూర్చున్నారు. కొందరు నేల మీద మోకాళ్ల మీద కూర్చున్నారు. కొందరు నిలబడే వున్నారు.

ఆ రావి చెట్టు వూగుతూ, ఉత్సాహంగా వున్నా - ఆ జనం మాత్రం నిరుత్సాహంగానే వున్నారు.

ఆ వానకి ఆ ఊట గెడ్డ ఉరకలు వేసి పారలేదు. అయితే, అది చల్ల చల్లగా ప్రవహించి, చెఱువులో కొంత నీరు నింపింది.

'పొలాలు తడిసి నెలకి నెలా తిరిగిపోనాది. సెర్లో సేరిన నీరు నాయుడోరి పొలానికే సాల్దు! మనకేటి మిగుల్తాది! మన మళ్లు మండి, మాడిపోతయ్యి!..........' అని గుసగుసలు చెలరేగాయి. ఆ గుసగుసలకి నాయుడోరి సెవులంటే బయ్యం బయ్యం! అంచాత అవి ఆ చల్లగాల్లో కలిసిపోయాయ్.

అయితే-నూకరాజు అప్పుడే అక్కడకు వచ్చాడు. ఆ గుసగుసలు విన్నాడు.

'సెర్లో సేరిన నీరు నలుగురం నాలుగు పాయలెట్టుకుందాం! ఆ నీరు అందరి పొలాలికీ సర్దాల! ఆ నీరంతా ఒక్కరి పొలమే తాగీగూడదు!' అని నూకరాజు అన్నాడు.

'నాయుడోరి పొలం నిండకుండా, ఒక సుక్క కూడా, కిందికి దిగదు! దిగడానికి ఈల్లేదు! దిగదుగాక దిగదు!' అని నాయుడోరి పెదపాలేరు చెప్పాడు. అలా చెప్పి కొరకొరా నూకరాజు వేపు చూసాడు. అలా చూసి, నాయుడిగారి ఇంటి వేపు నడిచాడు.

ఆ జనం - ఆ జనం మాటలు విన్నారు. నూకరాజు మాటలు విన్నారు. నాయుడిగారి పెదపాలేరు మాటలు విన్నారు.

అయితే - ఆ తర్వాత ఎవరూ ఏవీ మాట్లాడలేదు.

* * *

ఆ వూరు చిన్నవూరు. ఆ వూరు చుట్టూ తాడి చెట్లు వరుసగా, గోడ కట్టినట్లు, వుంటాయ్. ఆ వూరు మధ్య రామమందిరం వుంది. మందిరం ముందు రావిచెట్టు వుంది. ఆ చెట్టు కింద రాతి బల్లలున్నాయ్.

ఆ వూరికి - పడమరగా - దూరంగా నూకాలమ్మ గుడి వుంది. నూకాలమ్మ గుడికి దగ్గరగా ఒక పొడవైన తాడి చెట్టు వుంది. ఆ చెట్టుని దేవుడు పోతురాజని, ఆ జనం కొలుస్తారు.

ఆ వూరికి తూర్పుగా - కొంచెం దూరంగా - రెండు అంతస్తుల భవనం వుంది. ఆ ఇంటి చుట్టూ ఎత్తయిన గోడవుంది. ఆ గోడ మీద సిమెంటుతో అతికిన గాజు పెంకులున్నాయ్.

ఆ ఇల్లే నాయుడిగారిది.

నాయుడుగారు నల్లగా వుంటారు. నల్లగావున్న నాయుడుగారు పొడవుగా వుంటారు.

అతడు తెల్లగా మెరిసే సిల్కు పంచె - సిల్కు లాల్చీలో శృంగారంగా కనబడతాడు.

అతడు ఇంగ్లీషు స్కూల్లో చదివాడు. అతడు ఏ స్కూల్లో చదివినా-అతడే ఒక స్కూలని కొందరంటారు.

భూములున్న నాయుడు వ్యవసాయం చేస్తున్నాడు. వ్యవసాయం చేస్తున్న నాయుడు, వ్యాపారం చేస్తున్నాడు. ఆ రెండూ చేస్తున్న నాయుడు, డబ్బు చేస్తున్నాడు. ఆ తర్వాత అతడు రాజకీయాల్లో తలదూర్చాడు. అందులో కూడా అతడు అతి తక్కువ కాలంలో అతి ముఖ్యమయిన పదవిని పొందాడు. అలా అలా అతడు అన్ని రంగాల్లోనూ కూడా బాగా ఎదిగాడు.చిన్న రైతుల బూవుల్ని కొరికి కొరికి అతడు పెద్ద బుగతగా పెరిగాడని కొందరు గిట్టని వాళ్లు అంటూ వుంటారు! చిన్న చిన్న వ్యాపారస్తుల్ని, నొక్కి, నొక్కి, అతి పెద్ద వ్యాపారస్తుడిగా ఎదిగాడని మరికొందరు గిట్టనివాళ్లు అంటూ వుంటారు! రాజకీయాల్లో కూడా అలాగే ఎదిగాడని చాలామంది గిట్టని వాళ్లు అంటూ వుంటారు.

ఎవళ్లేవన్నా అతడు వింటాడు. ఎదగడం స్వశక్తి మీద ఆధారపడి వుంటుందని అంటాడు. అవకాశాలు వినియోగించుగుని పెరగడమే ప్రగతి అంటాడు. ఆ ప్రగతే - దేశ ప్రగతికి - అతిముఖ్యమంటాడు. ఎవళ్లేమన్నా - అతడు మాత్రం తన ప్రగతి మార్గాన్ని వదల్డు!

అతడు ఇంగ్లీషులో మాట్లాడితే, ఇంగ్లీషువాళ్లు అతణ్ని ఇంగ్లీషువాడే అంటారు. అతడు తెలుగులో మాట్లాడితే - పిడుగుల్లాంటి పండితులు గూడా-అతడు పిడుగే గాకుండా మెరుపని కూడా-ఒప్పుగుంటారు. అతడు తెలుగులో - ఆ ప్రాంతం యాసతో మాట్లాడితే ఆ జనం పాముల్లా పడగెత్తి పరవశిస్తారు.

అతడు ఎక్కడ మాట్లాడినా-ఎప్పుడు మాట్లాడినా-ముఖ్యంగా కొన్ని విషయాలు చెప్తాడు. సమసమాజం కలే కాకుండా, కల్లని అంటాడు. ప్రపంచంలో ఎప్పుడూ ఎక్కడా సమసమాజం లేదుగాక లేదు - వుండదు గాక వుండదు - వుండబోదు గాక వుండబోదు - అని చెప్తాడు. సమసమాజం అనే ఆలోచన అభివృద్ధికి అడ్డు అని అంటాడు. ఆ ఆలోచన, మనశ్శత్రువులు మన మీదకు విసిరిన మారణాస్త్రమని అంటాడు. ఆ ఆలోచన మేధస్సుని అంధకారబంధురమైన అజ్ఞాన కూపంలో పాతి పెడుతుందని కూడా చెప్తాడు. అంతే గాకుండా-వాళ్లెవరెవరో చెప్పే సమసమాజం వేరంటాడు. సమాజంలో అన్ని హక్కులూ అందరికీ సమానంగా వుండడమే - సమసమాజమనీ నిర్వచిస్తాడు. అంతేగాకుండా - మనది సమసమాజమే అని చెప్పాడు. మన సమసమాజాలు మాత్రం నిజాలంటాడు.

అలా అలా - అంటూ అంటూ - అతడు అన్ని రంగాల్లోనూ కూడా ముందుకు వెళుతున్నాడు.

* * *

నూకరాజు, అప్పన్న కొడుకు. అప్పన్న ఆరు ఎకరాల పొలంవున్న చిన్నరైతు. అతడు చదువు కోసం నూకరాజుని పట్నంలో పెట్టాడు.

నూకరాజు బియ్యే పాసయే సరికి, ఒక ఎకరం పొలం, కొరుకుడికి పోయింది. అంతే గాకుండా - వానలు లేక పంటలు దెబ్బతిన్నాయ్. ఆ పరిస్థితుల్లో, నూకరాజు చదువు మానేసాడు. ఉద్యోగం కోసం చాలా ప్రయత్నించాడు. చాలా తిరిగాడు. చాలా డబ్బు ఖర్చు పెట్టాడు. అయితే-ఉద్యోగం దొరకలేదు. అంచాత ఉద్యోగం చేయకూడదని నిశ్చయించు గున్నాడు. అంచాత, వ్యవసాయం చేస్తూ బతకాలనీ ఆనాడే నిర్ణయించాడు.

అలా అతడు, వ్యవసాయంలో స్థిరపడ్డాడు. పంటలు బాగా పండుతున్నాయ్. దినుసులు పట్నంమార్కెట్టులో అమ్ముతున్నాడు. ఆ విధంగా అతడు జీవితంలో నిలదొక్కుకున్నాడు.

ఆ తర్వాత అతడు జీవితం గురించి ఆలోచిస్తున్నాడు. జీవితాన్ని చదువుతున్నాడు. అందరితో కలిసి, తిరుగుతూ జీవితాన్ని చూస్తున్నాడు.

జీవితంలో స్పష్టమైన ఆలోచన్లకి సాహిత్యం అవుసరమని అతడు అనుకున్నాడు. అలా అనుకుని, సాహిత్యంలో కళ్లు తెరిచాడు.

* * *

రాత్రి అయింది.

వానవెలిసింది. అయినా-చిన్న చిన్న తుంపర్లు పడుతున్నాయ్. చీకటి చిక్కగా వుంది. సృష్టి నల్ల ముసుగు వేసుకుని, నల్లగా వుంది. కప్పలు బెకబెకలాడుతున్నాయ్. మేకల దొడ్ల ముందు

చిన్న చిన్న మంటలు కనబడుతున్నాయ్. నక్కల కూతలు దూరంగా వినవస్తున్నాయ్. కుక్కల మొరుగులు, వాటికి జవాబుగా వుంటున్నాయ్. చెర్లో చేరిన నీరు, అందరికి సమానంగా చేరాలని అనుకున్న నూకరాజు ఆ చీకట్లో చెరువు వేపు నడిచాడు.

తెల్ల వారింది.

చెర్లో చేరిననీరు అందరి పొలాలూ చేరింది.ఆ వూరు వూరంతా, ఉత్సాహంతో, సంతోషంగా వూగుతోంది.

అయితే - నూకరాజు ఇంక మిగల్లని కూడా ఆ వూరు వూరంతా, గుసగుసలాడుతోంది.

ఆ సాయంకాలం నాయుడు విశాలమైన హాల్లో కూర్చున్నాడు. నాటు పొగాకు చుట్టకాలుస్తూ, ఆలోచిస్తున్నాడు. లోతుగానేగాకుండా, లోతు లోతుగా ఆలోచిస్తున్నాడు.

'......... నలపవలసి ఒస్తే, నాయుడు ఏనుగుల్ని కూడా, సీవల్ని నలిపేసినట్లు, నలిపేగల్డు! సీవని, సీవలా నలపడంవల్ల, నాయుడి కీర్తి దెబ్బతింటాది! పేరు పెరగని పనులు నాయుడు సేయలేడు! సేయడు! సీవల్ని ఎప్పుడు నలిపినా, నలిపీ ఒచ్చు!

అయితే-నాయుడు సీవల్ని నలపడు! నాయుడు నుదిటమీద, మూడచ్చరా లుంటాయ్!....... అహింస.......! నాయుడు, నోరిప్పితే అయిదచ్చరాలు పలుకుతాయ్! ........సమసమాజం ......! అంచాత-సీవల్ని ఎంటేసుగుంటే అహింసగానే గాకుండా,సమసమాజంగా వుంటాది! అది నాయుడికి మంచిది! మన దేశానికి మంచిది!'అని నాయుడు లోతుగా ఆలోచించి తేల్చుగున్నాడు. అహింస అనే మాటలో మూడక్షరాలేగాకుండా, ఒక తుపాకి గుండు కూడా వుందని అనుకుని విరగబడి నవ్వుకున్నాడు.

(ఆంధ్రజ్యోతి-సచిత్రవారపత్రిక-18-7-1969)